అతని ఆత్మ యీ పరిసరాల్లోనే విహారిస్తూ దాహంగొన్న వారిని ఇటువైపే లాక్కునివస్తుంది. అటువంటి వ్యక్తులకు పునర్జన్మ ఉండదు' అనుకుంటూ చేతిలో సంచితో నడక సాగించాడు.

# కోశాధిపతి

ఉదయం ఆరుగంటలు దాటింది. ఆకాశంలో శ్రావణ మేఘాలు నల్లని ఏనుగులవలె ప్రయాణం చేస్తున్నాయి. రక రకాల పక్షులు కర్ణపేయంగా కూస్తూ బారులు బారులుగా ఎగిరిపోతున్నాయి.

పార్థసారథి యింటి ఆవరణలో అరుగుమీద కూర్చుని పళ్ళు తోముకుంటున్నాడు. ఆ యింటికి ఎదురుగా దాదాపు నెలరోజుల క్రితం కొంత ఖాళీస్థలం వుండేది. ఆ కాస్త స్థలం మీద ముగ్గురు ఆసాములకు హక్కు వుండేది. వారు ముగ్గురూ త్రిభుజంలోని మూడు బిందువులవలె ఎప్పుడూ ఒక మాట మీదికి వచ్చేవారు కారు. కాని ఒక ఆఫీసరు ఎవరూ సాధించలేని ఆ పనిని సాధించాడు. ఎలాగైతేనేం ముగ్గురినీ

ఒకచోటచేర్చి ఆ స్థలం బేరంచేసికొన్నాడు. కొన్నతర్వాత దాదాపు పదిహేనురోజులలోనే ఆ స్థలంలో రెండంతస్థుల డాబా తయారైపోయింది.

పార్థసారథి తల పంకించి "అవును. డబ్బువుంటే మనుష్యుడు చెయ్యలేని పనిలేదు. కుందేటికొమ్ము అయినా సాధించవచ్చు"అనుకున్నాడు. తర్వాత అతడు తనయింటివైపు చూపులు సారించాడు. తమది పాతపెంకుటిల్లు. కప్పు కొద్దిగా క్రుంగిపోయివుంది. సున్నపుపెచ్చు లూడిపోయి, గోడలన్నీ పగిలివున్నాయి. ఆ ఇంటిని పదేళ్ళక్రిందట తమకు అమ్మినవారు, ఇనుము, సిమెంటు మొదలైన వస్తువులమీద కంట్రోలువుండగా కట్టించారు. ఇనుము దొరకనందువల్లనేమో కిటికీలు మరీ చిన్నవిగా అమర్చారు. పగలే ఇంట్లోకి వెలుతురు సరిగారాదు. ఈ వర్షాకాలంలో ఇల్లంతా ధారాపాతంగా కురుస్తుంది.

పార్థసారథి లేచివస్తూ "లాభంలేదు. వచ్చే నెల బోనసురాగానే ఆ డబ్బుపెట్టి, ఈ సంవత్సరం అయినా ఇంటికప్పు మళ్ళీ నేయించాలి. కొత్తపెంకు కప్పించాలి" అనుకున్నాడు.

అతడు లోపలికివెళ్ళి మొహం తుడుచుకుంటూవుండగా రుక్మిణి ఇత్తడిగ్లాసుతో, కాఫీతెచ్చి అందించి, అతని చేరువలో నుంచుని "సాయంకాలం వచ్చేటప్పుడు కాఫీపొడి, పంచదారా తీసుకురండి. ఈ పూట పక్కయింటి వారిని బదులు అడిగి తీసుకుని కాఫీపెట్టాను" అన్నది.

పార్థసాగథి గ్లాసు ఖాళీచేసి ఆమె చేతికిచ్చి "మనకు బదులిచ్చినవారికి శుభమగుగాక" అన్నాడు.

ఆమె నవ్వి లోపలికి వెళ్ళిపోయింది. అతడలాగే ఆమె వెళ్ళినవైపు జాలిగాచూస్తూ కూర్చుండిపోయాడు. ఆమె దాదాపు రెండు నెలలక్రిందట 'తన చీరెలన్నీ చిరిగిపోయా' యనీ "చవకలో కనీసం రెండు చీరెలయినా కొనితెమ్మ"నీ చెప్పింది. కాని ఇంతవరకూ అతనికి వీలుపడలేదు. ఆమె చాలాసార్లు చిరిగిన చీరెలు కుట్టుకుంటూవుండటం అతడు చూశాడు కూడా. కాని అతడేమీ చెయ్యలేకపోయాడు.

పార్థసారథి కూర్చునివున్నవాడల్లా ఉలిక్కిపడ్డాడు. ప్రక్కగదిలో పసిపిల్లవాడి ఏడుపు వినిపించింది. తల్లి ఇంకా లేచినట్టులేదు. పసి డేమో గుక్కపట్టి ఏడుస్తున్నాడు. పార్థసారథి పక్కగుమ్మం దగ్గరికివెళ్ళి 'అక్కయ్యా! లే, పిల్లవాడి ఏడుపు వినిపించటంలేదూ?' అన్నాడు. ఆమె లేచికూర్చుని ఆవులించి, పిల్లవాణ్ణి వొళ్ళోకి తీసుకున్నది మరుక్షణంలో పసివాడు ఏడుపు మానివేశాడు. పార్థసారథి ఇవతలకివచ్చాసు. నిన్ననే అతని బావగారిదగ్గరనుంచి ఉత్తరం వచ్చింది. "తాను హోటలుభోజనంతో చాలా బాధపడిపోతున్నా"ననీ, "ఇంకా కొన్నాళ్ళు యిలాగే జరిగితే తన ఆరోగ్యం పూర్తిగా చెడిపోగల ప్రమాదం వున్నద"నీ, "కాబట్టి వీలయినంత త్వరగా ఆమెను పంపించమ"నీ వ్రాశాడాయన. "అవును వచ్చేనెల జీతం అందుకోగానే ఎలాగో తంటాలుపడి ఆమెను రైలెక్కించివేయాలి లేకపోతే మర్యాదదక్కదు. నాలుగునెలలు వెళ్ళాయిగా." అనుకున్నాడు పార్థసారథి.

పంచలో అతని తమ్ముడూ, చెల్లెలూ ఇంకా నిద్ర పోతూనేవున్నారు. అతని తమ్ముడు పదహారేళ్ళవాడు. వాడి పేరు మురళి. స్కూల్‌ఫైనల్ చదువుతున్నాడు. చెల్లెలు చిన్నపిల్ల ఏడేళ్ళది. ఆ పిల్లపేరు శకుంతల. ఆ పిల్లకూ పార్థ సారథికీ రెండురోజుల క్రితమే చిత్రమైన సంభాషణ జరిగింది. ఆ పిల్ల తన చిన్న అన్నయ్యతో ఏదో వాదించి, అందరూ ముందుగదిలో కూర్చునివుండగా అక్కడికివచ్చి పార్థసారథి వొళ్లోకూర్చుని, "అన్నయ్యా! మీ ఆఫీసునిండా వంద రూపాయలనోట్లూ, పదిరూపాయలనోట్లూ కట్టలు కట్టలుగా వుంటాయికదురా? అవన్నీ నీవేకదూ?" అని అడిగింది. పార్థసారథి ఆ పిల్లను దగ్గరికి తీసుకుని "అవునే అమ్మడూ" అన్నాడు.

"నే నా మాటే అంటే కాదంటున్నాడు చిన్న న్నయ్య. నే నొకసారి మీ ఆఫీసుకువచ్చి చూశానుకూడా" అంటూ ఆ పిల్ల కాస్సేపాగి, "అయితే నా పరికిణీలన్నీ చినిగి పోయాయనిచెప్పి బోలెడు రోజులయిందికదా! ఆ డబ్బంతా నీదేకదా! ఇన్నాళ్ళయినా కుట్టించలేదేం?" అన్నది. పార్థసారథి ఏం సమాధానం చెప్పాలో తెలియక మౌనంగా కూర్చున్నాడు. అతని అక్కగారుమాత్రం నవ్వి "బాగుంది. ఆ డబ్బులో ఒక్క నయాపైసా తాకినా చేతులకు బేడీలు పడతాయి" అన్నది. ఆ పిల్లకు ఏమీ అర్థంకాక అసలే చక్రాలవంటి తన విశాల నయనాలను మరింత పెద్దవిగా చేసుకుని చూస్తూ అమాయకంగా నిలబడిపోయింది.

ఎండలో చురుకుపాలు ఎక్కువవుతున్నది. పార్థసారథి వాళ్ళిద్దరినీలేపి "ఏడుగంటలు దాటుతున్నది, మరీ యింత మొద్దునిద్ర అయితే ఎలా? రోజూ తెల్లవారుజామున లేచి చదువుకోమని ఎన్నిసార్లు చెప్పాను. లేచి త్వరగా మొహాలు కడుక్కొని పుస్తకాలు ముందువేసుకుని కూర్చోండి" అన్నాడు. వాళ్ళిద్దరూ లేచి నిద్రమత్తుతో తూలుతూ లోపలికి వెళ్లారు.

పార్థసారథి అక్కగారు పిల్లవాణ్ణి భుజంమీద పడుకోబెట్టుకొని, ముందుగదిలోకివచ్చి "ఏమిరా పార్థుడూ! ఇవాళ అయినా వారికి జాబు వ్రాయటం మరిచిపోవుగా?" అన్నది. అతడు ఏదో పుస్తకంకోసం వెదుకుతూ "అలాగేలేవక్కా! అసలు నిన్ననే జవాబు వ్రాయవలసింది. చెప్పానుగా! పని ఎక్కువగావుండి వీలుపడలేదని. రాత్రి పదిగంటలు దాటింది యింటికి వచ్చేసరికి" అన్నాడు.

ఆమె కాస్సేపాగి "ఏమని వ్రాస్తావు?" అని అడిగింది. పార్థసారథి నవ్వి "వ్రాసేందుకేముందీ? 'అయ్యా! బావగారూ! మీ ఆపిడను పై నెల మొదటివారంలో తప్పక తీసుకునివస్తాను. ఇక్కడే ఎప్పటికీ వుంచుకోమన్నా వుంచుకోము' అని వ్రాస్తాను" అన్నాడు. ఆమె నవ్వింది.

ఇంతలో మురళీ, శకుంతలా మొహాలు కడుక్కొని ముందుగదిలోకి వచ్చారు. మురళి తల దువ్వుకుంటూ "స్కూలుఫీజు కట్టాలిరా, అన్నయ్యా! పైగా నాకు లెక్కలు కష్టంగా వున్నాయిరా. ట్యూషను చెప్పించుకుంటాను!" అన్నాడు. పార్థసారథి స్కూలు ఫీజు సంగతి ఎత్తి

కుండా, "ట్యూషను చెప్పించుకోవచ్చులే. అయినా ఇప్పటి నుంచే ఎందుకు? ఈ ఆరునెల్ల పరీక్షల్లోకూడా చూసి అప్పుడు అవసరమైతే ట్యూషన్ చెప్పించుకోవచ్చు." అని సమాధానం చెప్పాడు. అతని చూపులు మురళి వేసుకున్న చొక్కా మీద పడ్డాయి. అది భుజంమీద చిరిగివుంది. "పిచ్చి వెధవ! అందరు పిల్లలతో కలిసి తిరిగేందుకు ఎంతసిగ్గుపడుతున్నాడో!" అనుకుని పార్థసారథి వొంకెన తగిలించివున్న తన చొక్కా వంక చూశాడు, అదికూడా రెండు భుజాలమీదా చిరుగులు పట్టివుంది. అయినా మరొక రెండురోజులు గడిచి చాకలి వాడు బట్టలు తెచ్చేదాకా అదే తనకుగతి. పైన కోటు వుంటుంది కాబట్టి ఫరవాలేదు. ఇంట్లో ఎవరగుడ్డలు బాగున్నాయిగనుక! మొన్న శకుంతల "పరికిణీలన్నీ చిరిగిపోయాయి, కుట్టించమ"ని అడిగిందికూడా. అవునుమరి! శ్రావణ మాసం! పేరంటాల హడావిడి ఎక్కువ. మంచి పరికిణీ ఒక్కటి అయినా లేకపోవడం దానికెంత అవమానంగా వుందో! తన సంగతి ఎలావున్నా ముందు రేపు బోనసు రాగానే అందరికీ గుడ్డలు కొనాలి. తన సంగతి తర్వాత చూసుకోవచ్చు.

పార్థసారథి లేచి, స్నానసంధ్యాదులు ముగించి, భోజనంచేసి, చొక్కాతొడుక్కుని, దానిమీద కోటుధరించి బయలుదేరాడు. అతడు నెమ్మదిగా నడిచి ఫ్యాక్టరీ చేరుకునే సరికి సరిగా పదిగంటలయింది. ఆఫీసు ఆవరణలో ప్రవేశించిన పార్థసారథినిచూసి వాకిట్లో కూర్చునివున్న ప్యూను లేచి నమస్కరించాడు. పార్థసారథి తాళంతీసి క్యాష్‌రూమ్

లోకి వెళ్ళాడు. ఆనాడు పనివారందరికీ బోనసులూ, జీతాలూ ఇవ్వాలి. అతడు క్రిందటిరాత్రి ప్రొద్దుపోయేదాకావుండి అన్ని ఏర్పాట్లూచేసుకున్నాడు. ఇక ఇవాళపోయి బ్యాంకిలో డబ్బు డ్రా చేసుకువచ్చి పనివారికి ఎవరిడబ్బు వారికి పంచియివ్వాలి. అంటే ఆతని కానాడు ఊపిరి పీల్చుకునేందుకైనా తీరిక ఉండదని అర్థం.

అతడు దాదాపు పదకొండుగంటలకు ప్యూను వెంటరాగా బ్యాంకికి వెళ్ళి డబ్బు డ్రా చేసుకున్నాడు. అక్కడ వరండాలోకూర్చుని, ప్యూను పక్కన నిలబడివుండగా జాగ్రత్తగా ఒకటికి రెండుసార్లు లెక్కపెట్టుకున్నాడు. అంతా రెండు లక్షలరూపాయలు. లెక్క అంతా పూర్తి అయేసరికి ఒంటిగంట అయింది. తర్వాత ఆ పెద్ద తోలుపెట్టెను కారులో వేసుకుని మళ్ళీ ఫ్యాక్టరీకి తిరిగివచ్చాడు. అప్పటికే ఆ షిఫ్టులో పనిలేని కార్మికులు క్యాష్‌రూము ముందు నిలబడివున్నారు. పార్థసారథినిచూసి అందరూ మర్యాదగా త్రోవఇచ్చి నమస్కారాలుచేశారు.

అతడు లోపలికిపోయి కౌంటర్ ముందు కూర్చున్నాడు. అందరూ అలా నిలబడివుండగా కాఫీకి వెళ్ళటం కూడా అతనికి ఇష్టంలేదు. పైగా యీనాడు మామూలు జీతాలుకాక బోనసులుకూడా ఇస్తున్నారాయె!

అతడు జీతాలూ, బోనసులూ ఇవ్వటం ప్రారంభించాడు. మళ్ళీ అతడు లేచేవీలుకూడా లేకపోయింది. క్రమంగా యితర షిఫ్టులలో పని ముగించుకుని వస్తున్నవారుకూడా క్యూలో చేరటం ప్రారంభించారు. సాయంకాలం అయిదు

గంటలవేళ పార్థసారథి ప్యూనుచేత కాఫీ తెప్పించుకుని త్రాగి కౌంటరు కమ్ములలోనుంచి బయటికిచూసి "అమ్మో" అనుకున్నాడు. బయట హనుమంతుని వాలంవలెవున్నది క్యూ. అతడికి కష్టమనిపించింది. తాను నిజానికి సాయంకాలం ఆరుగంటలప్రాంతంలో పని అంతా ఆపివేసి క్యాష్ రూము మూసివేసి యివతలికి రావచ్చు. కాని అతడికి అలా చేసేందుకు మనస్కరించలేదు. తాను బోనసు డబ్బు తీసుకోగానే ధారాపాతంగా కురుస్తున్న ఇంటికప్పు నేయించాలనుకున్నాడు. భార్యకు చీరెలూ రెవికలగుడ్డలూ కొనాలనుకున్నాడు, చెల్లెలికి పరికిణీలూ జాకెట్లూ కుట్టించాలనుకున్నాడు. తమ్ముడికి లాగులూ చొక్కాలు కుట్టించి, స్కూలుఫీజు కూడా ఇవ్వాలనుకున్నాడు. అన్నిటికీమించి తన అక్కగారిని తనకు చేతనయినంత చీరె సారె పెట్టి భర్త దగ్గరికి పంపించివేయాలనుకున్నాడు. అటువంటి అవసరాలు యీ క్యూలో నిలబడివున్న కష్టజీవులకు మరెన్ని వున్నాయో? ఏమయినాసరే! చివరివ్యక్తికి కూడా జీతమూ బోనసూ ఇచ్చిగాని, తాను ఇంటివిషయం జ్ఞాపకంకూడా చేసుకోరాదు.

అతడు క్రమంగా తన పనిలో లీనమైపోయాడు. చివరకు కౌంటర్ ముందు నలుగురైదుగురు పనివాళ్లు నిలబడి వుండగా అతడు తలయెత్తి గోడగడియారంవైపు చూశాడు. పదకొండు గంటలయింది. గూర్ఖావాడు వచ్చి గుమ్మంలో నిలబడివున్నాడు. ప్యూను జీతాలూ బోనసులూ తీసుకుని

ఇళ్ళకుపోతున్న వారందరిదగ్గరా 'మామూలు' అనేపేరుతో పావలా, బేడా వసూలుచేసుకున్నాడు.

ఆ నలుగురుకీకూడా డబ్బుయిచ్చి లేచేసరికి అతనికి కళ్ళు తిరిగినట్టయింది. అతడు నిలబడలేక తూలిపోయి మళ్ళీ కుర్చీలో కూలబడ్డాడు. ప్యూన్ వచ్చి "ఏమిటిసార్ ?" అని అడిగాడు. పార్థసారథి మొహం తుడుచుకుంటూ "ఏమీ లేదు. ఒక సోడాపట్టుకురా" అన్నాడు. సోడా తాగినతర్వాత అతనిలో కొద్దిగా సత్తువవచ్చింది. అతడులేచి మిగిలివున్న డబ్బును ఐరన్ సేఫ్‌లోవుంచి తాళాలువేసి యివతలికివచ్చాడు. ప్యూన్ ఆఫీసు గదికి తాళాలు వేసినతర్వాత మళ్ళీ వాటినికూడా లాగిచూసి జాగ్రత్తగా పరిశీలించి ఇంటిత్రోవ పట్టాడు. ప్యూన్ "నేను సెలవుతీసుకుంటాను బాబుగారూ?" అని చెప్పి మరొక త్రోవన వెళ్ళిపోయాడు.

ఆకాశంలో జలార్ద్రమైన నల్లని మేఘాలు కమ్ము కుంటున్నాయి. చల్లనిగాలి విసురుగా వీస్తున్నది. శుక్లపక్ష రశి అయినా ఆ చంద్రుడేమయినాడో అతని వెన్నెల ఏమయిందో తెలియదు. నల్లని ఏనుగులవంటి మేఘాలు గర్జిస్తూ "కురుస్తాం కురుస్తాం" అంటున్నాయి. పార్థసారథి త్వరత్వరగా నడిచాడు. అయినా అతడు మరొక ఫర్లాంగు దూరం నడిస్తే ఇంటికి చేరుకొనగలడనగా వాన ఏదో ముంచుకుపోయినట్టు తరుముకుని రానేవచ్చింది అతడు మధ్యలో ఎక్కడయినా తలదాచుకుందామన్న ఆలోచన అయినా లేకుండా ఆ నిశ్శబ్ద నిశీథిలో, వర్షంలో తడుస్తూనే ఇంటికి వచ్చాడు.

ఇంట్లో అందరూ నిద్రపోతున్నట్టున్నారు. ఏ అలికిడీ వినిపించటంలేదు. కాని ముందుగది తలుపు తీసివుంది. రుక్మిణి మంచంకోటికి తల ఆనించి కూర్చుని కునికిపాట్లు పడుతున్నది. ఎదురుగావున్న దీపపుకాంతిలో ఆమె ముఖం కొద్దిసేపటిక్రిందట మబ్బులలో దోవతప్పి మాయమైన చంద్రబింబంవలె వున్నది. పార్థసారథి ఆ తడిగుడ్డలతోనే గుమ్మం దాటి లోపలికివెళ్ళి తన కుడిచేతితో ఆమె చుబుకాన్ని పట్టుకున్నాడు. ఆమె ఉలిక్కిపడిలేచి "మీరా? ఎంతసేపయింది వచ్చి? బాగా తడిసినట్టున్నారే" అంటూ త్వరత్వరగా ధోవతి అందించి, మంచంమీద కూర్చోబెట్టి అతని తల తుడిచింది.

అతడు నవ్వి "ధూపంకూడా వేస్తావా?" అని అడిగాడు. ఆమెకూడా నవ్వుతూ "నైవేద్యంమటుకు పెడతాను. వడ్డిస్తాను. లేచిరండి" అంటూ వంటయింట్లోకి వెళ్ళింది.

పార్థసారథి భోజనంచేసివచ్చి ముందుగదిలో కూర్చున్నాడు. రుక్మిణి వంటగదిలో పనులన్నీ ముగించుకుని వచ్చింది. నీళ్ళతో నిండిన మరచెంబుతో ముందుగదిలోకి వస్తున్న రుక్మిణినిచూసి పార్థసారథి "నాకు భగవంతుడు మేడలూ, మాడలూ ఇవ్వకపోతేనేం? ఈ కుందనపుబొమ్మను ఇచ్చాడు చాలు!" అనుకున్నాడు. ప్రక్కగదిలో పసిపిల్లవాడు ఏడుపు రాగం తీయబోయి మళ్ళీ "ఎందుకులెమ్మ"ని మానుకున్నాడు.

రుక్మిణి పడుకుంటూ "ఇవాళ ఇంత ప్రొద్దుపోయిందేం?" అని అడిగింది. అతడు "అవును మరి, మనమంటే

ఏమిటనుకున్నావు ? ఇవాళ పనివాళ్ళందరికీ జీతాలూ బోనసులూ ఇచ్చాను. మొత్తం ఎంతో తెలుసా ? అంత డబ్బు నువ్వెప్పుడూ చూసికూడా వుండవు. లక్షా ఎనభై వేల పై చిలుకు. ఈ చేతులతోనే ఆ డబ్బంతటినీ లెక్కపెట్టాను. లెక్కపెట్టేందుకే గంటల తరబడి పట్టింది. ఆ డబ్బంతా మన అధీనంలోనే వుంటుంది." అన్నాడు. "అంటే మీరు లక్షాధికారులన్నమాట" అన్నది రుక్మిణి నవ్వి. అతడు తలవూపి "అవును. అక్కడ వున్నంతసేపూ మనం సర్వాధికారులం. ఆ గదిలోకి అడుగు పెట్టేందుకు, ఎంత పెద్దఫ్యాక్టరీ అధికారి అయినాసరే, నా అనుమతి పొందనిదే వీలులేదు. అంత డబ్బూ నా అధీనంలోనే వుంటుంది. నువ్వు కాపురానికి వచ్చి ఇంకా సంవత్సరం అయినాకాలేదు. నా గురించి నీకేం తెలుసు ? ప్రతినెలా దాదాపు పదిలక్షల రూపాయలు నా చేతిలో తిరుగుతూవుంటుంది" అన్నాడు.

రుక్మిణి ఆవలిస్తూ "నాకు నిద్రముంచుకుని వస్తున్నది బాబూ" అన్నది. అతడు చిటికెవేస్తూ "ఓ, క్యాషియర్ సతీమణీ! హాయిగా పడుకుని కలలులేని నిద్రపో" అన్నాడు.

తర్వాత పదినిముషాలు గడిచివుంటుంది. పై కప్పు లోనుంచి "టపటప"మని చినుకులు అతడు పడుకొన్నమంచం మీదనే పడుతున్నాయి. అతడు రుక్మిణికి దుప్పటికప్పాడు. అతనికి కప్పుకునేందుకు ఏమీలేదు. అతనిమీదకూడా దాడి సాగించాయి చినుకులు. అతడు ఒక తుండుగుడ్డను చినుకులకు అడ్డంగా కప్పుకున్నాడు ఆ మంచంవున్న మేరమాత్రమే నయం. మిగిలిన గది అంతా మరీ ఎక్కువగా కురుస్తున్నది.

పార్థసారథికి నిద్రవస్తున్నది. అతడు ఆవులిస్తూ, వచ్చేనెల అయినా బోనసు డబ్బురాగానే యింటికప్పు నేయించాలి. పాడు వర్షం...అక్కయ్యను తప్పకుండా పంపించివేయాలి......అక్కడ బావ ఎంత ఇబ్బంది పడుతున్నాడో!......ఈవేళ ఆయనకు ఉత్తరం వ్రాయటానికి కూడా తీరలేదు...ఈ వర్షం తగ్గేట్టులేదే...మురళీ, శకుంతలా ఎక్కడ పడుకున్నారో...వాళ్ళు పడుకున్నచోటకూడా కురుస్తున్నదేమో! మురళికి జీతంకట్టాలి...ట్యూషన్‌లో కూడా చేర్పించితే మంచిది...యీ స్కూళ్ళలో అసలు పాఠాలు సరిగా చెప్పరు...(నవ్వుకుని) అవును...పాఠాలు సరిగా చెపితే ప్రయివేట్లు దొరకవుగా...రుక్మిణి బుగ్గమీద వాన చినుకు పడింది...(సున్నితంగా తుడిచాడు) ఫరవాలేదు...మెలకువరాలేదు...రుక్మిణి కుందనపుబొమ్మ...ఈ మాసిన, చిరిగిన చీరెలతో కాలం గడుపుతున్నది...పిచ్చిపిల్ల...బోనసు రాగానే కనీసం రెండయినా మంచి చీరెలు కొనుక్కురావాలి. (నవ్వుకుని)..."అయినా యిన్నిటికీ ఆ కాస్తడబ్బూ సరిపోతుందా!" అనుకుంటూ నిద్రాదేవత వొడిలోకి జారిపోయాడు, ఆనాడు ఆఫీసులో రెండు లక్షల రూపాయలు తన అధీనంలో వుంచుకుని పనివారికి పంచి యిచ్చిన కోశాధిపతి, పార్థసారథి.